క్లుప్తంగా

డీప్‌బోర్‌కు మరమ్మతులు చేయించాలి



ఏఓ దావూద్‌తో మాట్లాడుతున్న అంజయ్య

దొనకొండ: మండలంలోని యర్రబాలెంలో 40 రోజుల క్రితం డీప్‌బోరు మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదని, దానికి వెంటనే మరమ్మతులు చేయించాలని సీపీఎం కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, కుందుర్తి చిన్న నరసింహులు ఏఓ ఎస్‌ఎండీ దావూద్‌ను కోరారు. గతంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసినా, పంచాయతీ కార్యదర్శికి పలు మార్లు విన్నవించినా అదుగో..ఇదుగో అంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఎంపీడీఓతో మాట్లాడి మోటార్ బిగిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇంటర్ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న లెక్చరర్లు

దొనకొండ: నెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు జూనియర్ కళాశాల విద్యార్థులు సాల్మన్‌రాజు, కాళికాబాబులు ఎంపికైనట్లు కళాశాల జూనియర్ లెక్చరర్ ఖాదర్‌వలి తెలిపారు. ఈ నెల 25న ప్రభుత్వ జూనియర్ కళాశాల సింగరాయకొండలో జరిగిన అండర్–19 స్కూల గేమ్స్‌లో వీరు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. వీరు నవంబర్ 9, 10, 11వ తేదీల్లో నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే రాష్ట్రస్థాయి అండర్–19 నెట్‌బాల్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని చెప్పారు. వీరిని కళాశాల లెక్చరర్‌లు, విద్యార్థులు అభినందించారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు



ఎస్సై శివబసవరాజు

త్రిపురాంతకం: గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై శివబసవరాజు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరుతో మాట్లాడారు. ప్రభుత్వం కేటాయించిన మద్యం షాపుల యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీకి మాత్రమే మద్యం విక్రయించాలని, అంతకంటే ఎక్కువ ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు.

దాతల సహకారంతో
దేవాలయం అభివృద్ధి



బ్రహ్మంగారి విగ్రహం



ఆశ్రమంలోని ఆంజనేయస్వామి విగ్రహం



గోశాలలోని గోవులు

దొనకొండ:

స్థానిక నాలుగు రోడ్ల కూడలి ఆనంద ఆశ్రమంలో వెలసిన శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి, శివపార్వతులు, అభయాంజనేయ, సిద్ధమూర్తి, నందీశ్వర, కాశీనాయన ఆలయాలు కొద్దికాలం నుంచి దాతల సహకారంతో దిన దినాభివృద్ధి చెందుతున్నాయి. దాతలు ముందకొచ్చి విరాళాలు అందిస్తూ దేవాలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారు.

ఆలయాల అభివృద్ధి ఇలా..

నరసింహనాయునిపల్లెకు చెందిన బ్రహ్మంగారి పరమ భక్తుడు కాకర్ల భైరవానందస్వామి దేవాలయాలు అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో దాతల సహకారం కోరి 2010లో దేవాలయాలకు శంకుస్థాపన చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు దాతలు ముందకు వస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. 2015లో బ్రహ్మంగారు ఆంజనేయస్వామి ఆలయాలు నిర్మించి ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా అయ్యప్ప భక్తులు వందల సంఖ్యలో పూజలు చేస్తూ అన్నదాన కార్యక్రమానికి, ఆలయాల అభివృద్ధికి ముందుకొస్తున్నారు. అనంతరం శివాలయం గోపురం వరకు నిర్మించారు. 33 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రోజూ భక్తులు శాంతి పూజలు, నవగ్రహ పూజలు నిర్వహిస్తూ వచ్చిన విరాళాలతో కాశి నాయన, నందీశ్వరుడు, ధ్యాన మందిరం ఏర్పాటు చేశారు. ధ్యాన మందిరంలో భక్తులు ఏకాగ్రతతో పూజలు చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. నవగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆనంద ఆశ్రమంలో గోసంరక్షణ చేపడితే ఆశ్రమంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు పాడి పంటలు సస్యశామలంతో ఉంటాయని ప్రగాఢ నమ్మకంతో దాతల సహకరం గోశాల ఏర్పాటు చేశారు.

దాతలు సహకరించాలి



నిర్మాణంలో ఉన్న ఆలయం, మరికొన్ని గోపురాలను ఏర్పాటుకు దాతలు సహకరించాలి. ఇప్పటికే దాతల సహకారంతో దేవాలయాలు ఏర్పాటు చేశాం. ఆలయంలో నిత్యం భక్తులకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయ్యప్ప, బ్రహ్మంగారి భక్తులకు మాలలు ధరించే సమయంలో అన్నదానం చేస్తున్నాం.

– కాకర్ల భైరవానందస్వామి

పదో తరగతి పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

- అపరాధ రుసుం లేకుండా వచ్చే నెల 11వ తేదీ వరకు గడువు



పదో తరగతి విద్యార్థులు

పుల్లలచెరువు: విద్యార్థి జీవితం తొలి పరీక్ష పదో తరగతి గట్టెక్కడం. ఈ పరీక్షలు వచ్చే ఏడాది మార్చి.. ఏప్రియల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం పరీక్ష ఫీజు చెల్లింపు వివరాలు ఇలా ఉన్నాయి.

ఫీజుల వివరాలు ఇలా..

అపరాధ రుసుం లేకుండా వచ్చే నెల 11వ తేదీ లోగా పదో తరగతి పరీక్ష ఫీజు అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చు. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు నవంబర్ 11వ తేదీలోగా నామినల్ రోల్స్ పూర్తి చేసిన తర్వాత స్కూల్ లాగిన్‌లోని లింక్ ద్వారా మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మాన్యువల్ నామినల్ రోల్స్ నేరుగా సంబంధిత డీఈవో కార్యాలయంలో సబ్మిట్ చేయాలి. వచ్చే నెల 12 నుంచి 18వ తేదీలోగా రూ.50 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చు. 19వ తేదీ నుంచి 25వ తేదీలోగా రూ.200 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంది. ఇక 26 నుంచి 30వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి రికగ్నిషన్ పెండింగ్ ఉన్న పాఠశాలల ఆన్‌లైన్ లాగిన్ ఎనేబుల్ కాలేదు. రికగ్నిషన్ పెండింగ్ ప్రక్రియను పూర్తి చేసుకున్న పాఠశాలలు సంబంధిత, లాగిన్‌ను ఎనేబుల్ చేయించుకోవాల్సి ఉంటుంది. పైన పేర్కొన్న తేదీల్లో ఏవైనా సాధారణ సెలవు దినాలుంటే తర్వాత పనిదినం రోజు కూడా ఫీజు చెల్లించేందుకు అనుమతి ఇస్తారు.

రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి పరీక్ష ఫీజు రూ.125 చెల్లించాలని, ఫెయిలైన అభ్యర్థులు మూడు లేక అంతకన్నా తక్కువ సబ్జెక్టులకు రూ.110, మూడు కంటే ఎక్కువ ఉంటే రూ.125లు, వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులు పరీక్ష ఫీజుతో పాటు అదనంగా మరో రూ.60 చెల్లించాలి.

హెచ్‌ఎంలే బాధ్యత వహించాలి:

నామినల్ రోల్స్ సబ్మిట్ చేసే సమయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్న తప్పు దొర్లినా సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. నామినల్ రోల్స్‌ను ఒకటికి రెండు సార్లు సరి చూసుకుని మాత్రమే సబ్మిట్ చేయాలి. ఈ విషయంపై హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– చంద్రమౌళేశ్వర్, డిప్యూటీ డీఈవో, మార్కాపురం

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి:

పదో తరగతి పరీక్ష ఫీజుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలి. ఫీజు చెల్లింపు సమయంలో ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ సూచించిన నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలి.

– శామ్యూల్ జాన్, ఎంఈవో, పుల్లలచెరువు

జాబ్‌మేళాలో 17 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో వివిధ కంపెనీల ప్రతినిధులు

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగమేళాలో 17 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ డాక్టర్ నగేష్ తెలిపారు. జాబ్‌మేళాలో ఎక్స్‌పీరియన్స్, ఆరోరాఫార్మా, ఫక్స్‌టెక్ సొల్యూషన్స్ ఇంక్, స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 42 మంది నిరుద్యోగులు పేర్లు నమోదు చేసుకున్నారు. 25 మంది షార్ట్ లిస్ట్ అయ్యారు. చివరకు 17 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని నగేష్ వివరించారు. స్కిల్ హబ్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఎస్.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాసు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



దర్శి: వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై మురళి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై నాగరాజు

దర్శి: స్థానిక కురిచేడు రోడ్డులోని ఆంజనేయ స్వామి గుడి సమీపంలో ఓ బడ్డీ దుకాణంలో అక్రమంగా విక్రయిస్తున్న 20 మద్యం క్వార్టర్ సీసాలను ఎస్సై మురళి మంగళవారం తన సిబ్బందితో వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

15 మద్యం బాటిళ్లస్వాధీనం

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పోలవరంలో అక్రమంగా విక్రయిస్తున్న 15 మద్యం బాటిళ్లను తూమాటి అనిల్ అనే వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. అందిన సమాచారం మేరకు మంగళవారం తనిఖీ చేసి మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కంభంలో ట్రాఫిక్ జంఝాటం

- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న రహదారులు
- చౌక్ సెంటర్‌లో పెద్ద వాహనం వస్తే దాటలేని పరిస్థితి
- బస్టాండులో రోడ్లపైకి దుకాణాలు.. నిలిచిపోతున్న వాహనాలు
- హైవే ఫుట్‌పాత్‌లపై వెలుస్తున్న దుకాణాలు
- పట్టించుకోని అధికారులు



బస్టాండులో బస్సులకు అడ్డంగా ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆటో

కంభం: రోడ్ల మార్జిన్లు ఆక్రమణలతో కుంచించుకుపోతుండటంతో కంభం పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోంది. ప్రధానంగా నిత్యం రద్దీగా ఉండే చౌక్‌సెంటర్, సర్కిల్ కార్యాలయం సమీపంలో హోల్‌సేల్ దుకాణాలు, దుస్తుల దుకాణాలు, కూరగాయల మార్కెట్ ఉండటంతో ఈ మార్గంలోకి లారీలు, ఇతర పెద్ద వాహనాలు సరుకులు దించేందుకు వస్తుంటాయి. చౌక్‌సెంటర్‌లో లారీ కానీ ఇతర ఏదైనా పెద్దవాహనం ఆగితే కనీసం ఆటో కూడా ముందుకు వెళ్లలేని పరిస్థితి. లారీలు ఆగిన సమయంలో అంబులెన్స్‌లు వస్తే వారికి తిప్పలు తప్పడం లేదు. చౌక్‌సెంటర్లో రోడ్డుకు ఇరువైపులా దుకాణాల్లోని వస్తువులను ప్రదర్శనకు ఉంచడం, వాహనాలు నిలిపేస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ మార్గంలో ప్రతిరోజు ఉదయం సాయంత్రం సుమారు 20 స్కూల్ బస్సులు తిరుగుతుంటాయి. పిల్లలను ఎక్కించుకుంటూ దించే సమయంలో బస్సులు ఆపినప్పుడు వెనుక ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో వెనక వచ్చే వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. హైవే వెంట ఫుట్‌పాత్‌లను సైతం ఆక్రమించుకొని దుకాణాలు పెట్టుకోవడం, వాహనాలు పార్కింగ్ చేసుకోవడం, భవనాల ముందు ఉన్న ప్రభుత్వ స్థలాలను యజమానులు చిరువ్యాపారులకు అద్దెలకు ఇస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

ఆటోలతో ఆర్టీసీ ఆదాయానికి గండి

ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో ఆటోలు ఇష్టానుసారంగా నిలిపేస్తున్నారు. బస్టాండ్‌లో బస్సులకు ఎదురుగా ఆటోలు ఆపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. మార్కాపురం, గిద్దలూరు, అర్ధవీడు వైపునకు ప్రయాణికులు ఎక్కువగా తిరుగుతుంటారు. ఆర్టీసీ బస్సులకు ఎదురుగా ఆటోలు ఆపుకొని దర్జాగా ప్రయాణికులను ఎక్కించుకొని పోతుండటంతో ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండి పడుతున్నా స్పందించడం లేదు. గతంలో హడావుడి చేసిన అధికారులు మళ్లీ వదిలేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారిపోయింది.

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పుల్లలచెరువు: కంది పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి సూచించారు. మంగళవారం మండలంలోని నాయుడుపాలెం, కవలకుంట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో కంది పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కంది పంట ప్రస్తుతం పూత వచ్చే దశలో ఉందని, తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పురుగును ఆశించకుండా ఉండాలంటే ఎకరాకు ఐదు లింగాకర్షక బుట్టలు పెట్టుకోవాలని, పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వేప నూనె, వేప గింజకషాయం పిచికారీ చేయాలని చెప్పారు. రామయ్య, శ్రీనివాస్, నబీరున్నీసా, భాను, రైతులు పాల్గొన్నారు.

దొనకొండ: ప్రస్తుత రబీ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో నిర్ణీత ప్రీమియం చెల్లించి సభ్యులుగా చేరాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం ఆరవెల్లిపాడు, తెల్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు పంటల బీమా పథకం గురించి వివరించారు. అనుకూల వాతావరణ పరిస్థితుల్లో రైతులు సాగు చేసిన పంట నష్టపోతే బీమా వర్తిస్తుందని, ప్రభుత్వం నిర్ణయించిన నామమాత్రపు ప్రీమియం చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. పప్పుశనగ, మినుములు, జొన్న, ఎర్రమిరప, మొక్కజొన్న పంటలకు బీమా కోసం డిసెంబర్ 15వ తేదీ వరకు, వరి పంటకు డిసెంబర్ నెల 31 వరకు గడువు ఉన్నట్లు చెప్పారు. బీమా ప్రీమియం చెల్లించిన పంటల వివరాలను రబీ సీజన్ చివర్లో ఈ– పంట నమోదుతో సరిపోల్చుతారన్నారు. బ్యాంకులో లోన్ తీసుకున్న రైతుల అంగీకారంతో ప్రీమియం మినహా ఇస్తారని చెప్పారు. లోన్ తీసుకోకుండా సాగు చేసిన రైతులు మీ సేవా కేంద్రంలో ప్రీమియం చెల్లించాలని, లేదా ఏ పంట సాగు చేస్తారో ఆ పంటకి నిర్ణయించిన ప్రీమియం సంబంధిత కంపెనీ పేరున డీడీ తీసి రైతు సేవా కేంద్రంలో అందజేయాలని సూచించారు. పశువులకు, గొర్రెలకు, మేకలకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి కరిష్మా తెలిపారు. అనంతరం రైతులకు పంట ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రైతులు, వ్యవసాయ సహాయకులు, జూనియర్ వెటర్నరి డాక్టర్ భూలక్ష్మి పాల్గొన్నారు.



పుల్లలచెరువు: రైతులకు సూచనలిస్తున్న ఏవో నిర్మలాదేవి

తాళ్లూరు: కురిసిన భారీ వర్షాలకు సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటేనే చీడ పీడల నుంచి పంటలను రక్షించుకోగలుగుతారని ఏఓ ప్రసాద్‌రావు సూచించారు. మండలంలోని మన్నేపల్లి, తురకపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వరి పంటలకు ఉల్లి కాడ, ఆకుముడత, దోమపోటు, తెల్లకంకి, అగ్గితెగులు వంటి అనేక రకాల తెగుళ్లు రాకుండా కలుపును తొలగించి వేప మందు ఉత్పత్తులతో మంచి దిగుబడి వచ్చేలా చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు నాగరాజు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కటకానిపల్లె, రామచంద్రకోటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కటకానిపల్లె, రామచంద్రకోటల్లో సాగు చేసిన మిర్చి, పత్తి పొలాలను క్షేత్ర పరిశీలన చేశారు. దీంతో పాటు ప్రధాన మంత్రి పసల్ బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. రబీ కాలంలో శనగ, మినుము, జొన్న, మిరప, మొక్కజొన్న, వరి తదితర ఆరు పంటలకు బీమా చేసుకోవచ్చన్నారు. వీహెచ్‌ఏ శ్వేత పాల్గొన్నారు.



తాళ్లూరు: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఓ, రైతులు

కురిచేడు: మండలంలో సాగు చేసిన కంది, మిరప పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పెద్దవరం, బయ్యవరం గ్రామాల్లోని పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ పంటలను కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కంది పంటలో ఆకుచుట్టు పురుగు ఆశించి ఆకులను, పూత తింటుందన్నారు. దీని ఉధృతి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మిలీ లేదా 2 మిలీ క్వినాల్‌ఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. రబీ పంట కాలానికి సంబంధించి పంట బీమా గురించి రైతులకు వివరించారు. వీఏఏలు అమరుద్దీన్, సౌమ్యలత, రైతులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: రబీ సీజన్లో పంటలు సాగు చేసిన రైతులు ప్రధానమంత్రి బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. మండల పరిధిలో తోకపల్లి, బోయిదగుంపుల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించిన శనగలు, వరి, మొక్కజొన్న, జొన్న, మినుము, మిరప పంటలు సాగు చేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సీఎస్సీ సెంటర్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. శనగ పంటకు ఎకరాకు రూ.368, మినుము పంట ఎకరాకు రూ.103, మొక్కజొన్న పంట ఎకరాకు రూ.105, మిరప పంట ఎకరాకు రూ.525, జొన్న పంట ఎకరాకు రూ.60 నగదు చెల్లించాలని, డిసెంబర్ 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టం రైతుల పేర్లు నమోదు చేశామని, జాబితాను స్థానిక రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించామని, అందులో ఎమైనా సందేహాలు ఉంటే గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.



పెద్దారవీడు: ఫసల్ బీమాపై అవగాహన కల్పిస్తున్న ఏఓ బుజ్జిబాయి

దర్శి: మండలంలోని ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని ఏఓ బాలకృష్ణ నాయక్ సూచించారు. పట్టణంలోని దర్శి–1, దర్శి–3 రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ పంటలను ఆశించే చీడ పీడలు, తెగుళ్ల గురించి క్షేత్రస్థాయి సందర్శనలు జరుగుతాయన్నారు. పంట నమోదు చేసిన రైతులకు అనేక ఉపయోగాలున్నాయని చెప్పారు. ప్రతికూల పరిస్థితుల్లో పంట నష్టం వాటిల్లినప్పుడు పంటలకు ఇన్సూరెన్స్ వర్తించాలన్నా, రైతు పండించి పంటలు గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలన్నా పంట నమోదు తప్పని సరిగా అవసరం అన్నారు. ఉద్యాన శాఖ అధికారి రవికుమార్ మాట్లాడుతూ 90 శాతం రాయితీతో అందిస్తున్న బిందు సేద్య పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీలు పొందవచ్చన్నారు. కౌలు రైతులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు.



కురిచేడు: కందిలో ఆకుచుట్టు పురుగును చూపుతున్న ఏఓ మధుబాబు



పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన రైతులు



దర్శి: రైతులతో మాట్లాడుతున్న ఏఓ బాలకృష్ణనాయక్

పాఠశాల గ్రౌండ్‌ను పరిశీలించిన జేసీ

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పూరిమిట్ల జెడ్పీ హైస్కూల్, పాఠశాల ఆటస్థలాన్ని జేసీ ఆర్.గోపాలకృష్ణ మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.. గ్రామంలో సమస్యలపై గ్రామస్తులను, స్థానిక ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

2న ప్రజావేదిక

దర్శి: ఉపాధి హామీ ప్రజావేదికను వచ్చే నెల 2వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్.కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో తనిఖీలు చేసి గ్రామ సభలు నిర్వహించామన్నారు. 16వ సామాజిక తనిఖీ నివేదికను ప్రజావేదికలో చదివి వినిపించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ మేట్లు, ఉపాధి హామీ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

కలెక్టరమ్మా.. మీరే న్యాయం చేయాలి

మార్కాపురం టౌన్: అక్రమంగా తొలగించిన తమను వెంటనే విధుల్లోనికి తీసుకునే విధంగా అధికారులకు చెప్పి తమ కుటుంబాలను ఆదుకొని న్యాయం చేయాలని మున్సిపల్ కార్మికులు మంగళవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం ఇచ్చారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వెలుగొండపై సమీక్ష చేసేందుకు వచ్చిన ఆమెకు మున్సిపల్ కార్మికులు సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు.